www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY

# వెలుతురు

సోమవారం 16 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 20 , పేజీలు : 12 వెల:రూ. 5/-
తెలుగు దినపత్రిక



## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టీ విక్రమార్క ను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల నాయకులు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:** ఆదివారం రోజున ప్రగతి భవన్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టీ విక్రమార్క ను కలసి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ , బీసీ కుల



## హుస్నాబాద్ పోచమ్మ ఆలయంలో అమ్మవారిని బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్ శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా మొక్కలు చెల్లించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రభుత్వ పాఠశాలలో అత్యాధునిక సాంకేతిక బోధనా..



**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధనా సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విశేష సేవలు అందిస్తున్న వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన 6 ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇకనుంచి అధునాతన ఎడ్‌టెక్? సదుపాయాలు అందనున్నాయి. ఆ మేరకు వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలతో రాష్ట్ర విద్యా శాఖ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. రోహిణి నందన్ నీలేకని గారి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, డాక్టర్ సునీతా కృష్ణన్ గారి నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, అలక్ పాండే గారి అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, ఖాన్ అకాడమీ, షోయబ్‌దార్ గారు నిర్వహిస్తున్న

## నిర్దేశించిన గడువులోగా భూ సమస్యల పరిష్కారం

- పదేళ్లలో పడ్డ గోసను రెవెన్యూ సదస్సుల్లో ఆవేదనతో రైతులు చెప్పుకుంటున్నారు
- 7,578 రెవెన్యూ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు స్వీకరణ
- ఐదు నక్షా గ్రామాల్లో శరవేగంగా భూ సర్వే
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:** రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై రైతులు చేసుకున్న దరఖాస్తులను నిర్ధేశించిన గడువులోగా పరిష్కరించాలని రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్ జిల్లా మినహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు 561 మండలాల్లో 7,578 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సదస్సుల్లో 4.61 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈసదస్సులు ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.



## సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ.. ఎయిర్ పోర్టుకు వచ్చిన దేశాధ్యక్షుడు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా ఆదివారం సైప్రస్‌కు చేరుకున్నారు. కెనడా, క్రొయేషియాలను కూడా సందర్శించనున్న ఈ పర్యటనకు సైప్రస్‌తో శ్రీకారం చుట్టారు. ఈ పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, పెట్టుబడులు వంటి కీలక

- ప్రధాని మోదీ మూడు దేశాల పర్యటన ప్రారంభం
- తొలి విడతగా సైప్రస్‌కు చేరుకున్న భారత ప్రధాని
- విమానాశ్రయంలో మోదీకి ఆత్మీయ స్వాగతం పలికిన సైప్రస్ అధ్యక్షుడు
- భారత్-సైప్రస్ ద్వైపాక్షిక సంబంధాలపై కీలక చర్చలు
- వాణిజ్యం, పెట్టుబడులే ప్రధాన అజెండా
- రెండు దశాబ్దాల తర్వాత ఓ భారత ప్రధాని సైప్రస్ సందర్శన





వెలుతురు



పాలేరు నియోజవర్గం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన ఏరువాక కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. అరక పట్టి పొలం దున్నారు. రైతు సోదరులకు, మహిళా కూలీలకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ఏడాది మంచి వర్షాలు పడి పాడిపంటల ఎగుమతిలో తెలంగాణ దేశంలోనే అగ్ర స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

**కూసుమంచి మండలం వెలుతురు జూన్ 15:**



# రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు వెంటనే ధరఖాస్తు చేయాలి

## - మండల వ్యవసాయ అధికారి

**శంకరపల్లి వెలుతురు జూన్ 15**

శంకరపల్లి మండలంలోని అర్హులైన రైతులు రైతు భరోసా పథకానికి ఈ నెల 18వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. సురేష్ బాబు గారు సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు ప్రతి ఏడాది రూ. 12,000 ఆర్థిక సహాయం ప్రభుత్వం అందిస్తుంది. జూన్ 5, 2025 వరకు కొత్తగా పట్టా పాస్‌బుక్కులు పొందిన రైతులు ధరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే గతంలో రైతు భరోసా నిధులు పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. వానాకాలం సాగు ప్రారంభం కావడంతో రైతులకు ప్రోత్సాహం కల్పించేందుకు ఈ పథకం అమలు చేయబడుతోంది. రైతులు తమ ల్యాండ్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో ధరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ధరఖాస్తు ప్రక్రియ పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుంది. రైతులు తమ గ్రామానికి సమీపంలోని రైతు వేదికలలో ధరఖాస్తు చేసుకోవచ్చు. అవసరమైన సమాచారం కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను శంకరపల్లి క్లస్టర్ మనీషా, ఫోన్: 6305920256, మోకిల క్లస్టర్: ఎ. రామకృష్ణారెడ్డి ఫోన్: 6305920259, పర్వేద క్లస్టర్: రేణుక ఫోన్:6305920258 మహాలింగాపూర్ క్లస్టర్: మొయినుద్దీన్ ఫోన్: 6305920257 సంప్రదించవచ్చు.

# జాలీగా కిట్టి పార్టీ

## హుషారుగా పాల్గొన్న మహిళలు





**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 15 :**

నారాయణ్ ఖేడ్ పట్టణంలో పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో కిట్టి పార్టీని జాలిగా నిర్వహించారు. ఆదివారం గణేష్ టెక్స్టైల్స్ గారి ఇంట్లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఫాదర్స్ డే సందర్భంగా వాళ్ళ నాన్నల ప్రేమ ఆప్యాయతలను, గొప్పతనాన్ని,కుటుంబం కోసం తండ్రి చేసే త్యాగాలను షేర్ చేసుకున్నారు. అనంతరం సరదాగా ఆటలు, పాటలతో గడిపారు. కార్యక్రమానికి గుజ్జేరి మధువాని,గున్నాల ఉమాపతి హోస్ట్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కిట్టి పార్టీల నిర్వహణ వల్ల రెగ్యులర్ గా మహిళల్లో ఉండే స్ట్రెస్ కొంతవరకు తగ్గి రిలీఫ్ గా ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు సామాజిక చైతన్యం పొంది వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ పద్మశాలి మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి మహిళలు హోస్టుగా వివరించిన వారికి శాలువా మెమెంటోతో సన్మానించారు.

### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టీ విక్రమార్క ను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల నాయకులు



సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు జీకేవిఎస్ ,రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సూగూరీ దుర్గయ్య గౌడ్ , మాజీ టీపీసీసీ అధికార ప్రతినిధి బి.వెంకటేష్ గౌడ్ మరియు బీసీ జనసైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నాగేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈనెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్...

- **తొలుత ఎంపిటిసి, జడ్పిటిసిలకు ఎన్నికలు...**
- **నేడు జరగబోయే క్యాబినెట్ లో నిర్ణయం...**
- **రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:**





ఈ నెలాఖరులుగా స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని, తొలుత ఎంపిటిసి, జడ్పిటిసి లకు ఎన్నికలు జరుగుతాయని, ఈరోజు సోమవారం జరగబోయే క్యాబినెట్లో పూర్తి విషయాలు చర్చించి ఎన్నికల తేదీ పై స్పష్టత ఇస్తామని రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం రోజున ఖమ్మం రూరల్ మండలం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాలేరు నియోజకవర్గంలోని ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి మండలం, తిరుమలాయపాలెం మండలం,



నేలకొండపల్లి మండలానికి చెందిన ముఖ్య నాయకులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. సమావేశ సందర్భంగా మంత్రి బొంగులేటి శ్రీనివాసరెడ్డి కామెంట్స్...

-ఎంపీటీసీ , జడ్పిటిసి ఎన్నికలు పూర్తయిన వెంటనే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు

- ఆయా గ్రామాల్లో నాయకుల మధ్య సఖ్యత ఉండాలి
- నాయకులు ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వండి
- ఎన్నికలకు రావడానికి 15రోజుల గడువు మాత్రమే ఉంది కాబట్టి.... మీ మీ గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ఎన్నికలకు సిద్ధం అవ్వండి
- రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుంది.
- ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలను ప్రజల దరిచేర్చడం జరిగింది.
- రాబోవు వారం రోజుల్లోనే అర్హులైన రైతు సోదరులందరికీ కుంట మొదలుకోని ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా, సన్నాలకు రైతు బోనస్ వారి వారి బ్యాంకు ఖాతాలలో జమా చేయడం జరుగుతుంది.
- సంక్షేమ పథకాల ఆవశ్యకతను ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదే
- మీ మీ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదు... వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా మీరే చూసుకోవాలి

# నిర్ధేశించిన గడువులోగా భూ సమస్యల పరిష్కారం

వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి మానవతా దృక్పథంతో వీలైనంత త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అధికారులతో ఆదివారం నాడు సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆగస్టు 15వ తేదీనాటికి అన్ని భూ సమస్యలను పరిష్కరించాలని ఈ ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. గత పదేళ్ల కాలంలో భూ సమస్యలకు సంబంధించి రైతులు ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారు. ధరణి చట్టం వచ్చాక తమ ప్రమేయం లేకుండానే రైతులు భూ సమస్యల్లో చిక్కుకున్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన రెవెన్యూ యంత్రాంగం ధరణి కారణంగా ఉత్సవ విగ్రహాల్లా మారిపోయారు. ప్రతిదానికి కోర్టు మెట్లు ఎక్కడమేతప్ప రైతుకు మరోదారి లేకుండా పోయింది. దాదాపు గత రెండు నెలలుగా భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో దాదాపు 50 ప్రాంతాల్లో తాను స్వయంగా పాల్గొనడం జరిగిందని, ఆసదస్సుల్లో రైతులు తమ గోసను ఆవేదనతో చెప్పుకోవడం తనను ఎంతో బాధకు గురిచేసిందన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా రైతులకు మేలు చేసేలా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు.

శరవేగంగా భూ సర్వే

రాష్ట్రంలో తరతరాలుగా సర్వే చేయని లేదా సర్వే రికార్డులు లేని ఐదు నక్షా గ్రామాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన భూసర్వే శరవేగంగా సాగుతోందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాష్ట్రంలో నక్షా గ్రామాలను గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వం లోని ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సర్వే చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 413 నక్షా గ్రామాలకు గాను ఐదు గ్రామాలలో ప్రయోగాత్మకంగా గత నెల మూడవ వారం నుంచి సర్వేను ప్రారంభించడం జరిగిందన్నారు.

రాష్ట్రంలో పైలెట్ గ్రామాలుగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్‌లో 422 ఎకరాలకు 337 ఎకరాల్లో సర్వే పూర్తయిందన్నారు. జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి ( కొత్తది) గ్రామంలో 626 ఎకరాలకు 269 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ లోని 845 ఎకరాలకు 445 ఎకరాలు ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురులో 502 ఎకరాలకు 232 ఎకరాలు సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ లో 593 ఎకరాలకు 308 ఎకరాలలో సర్వే పూర్తయిందని తెలిపారు మొత్తం ఐదు గ్రామాల్లో 2988 ఎకరాలకు గాను ఇప్పటివరకు 1591 ఎకరాల్లో సర్వే పూర్తిచేయడం జరిగిందన్నారు. మరో వారం పదిరోజుల్లో సర్వే ప్రక్రియను మొత్తం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

చిన్న వివాదాలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో భౌతికంగా ఈ సర్వే జరుగుతోందని మంత్రి వివరించారు. ఈ నూతన విధానాల వల్ల భూమి సమాచారం, పారదర్శకత, వివాద పరిష్కారం, భూ యాజమాన్యంలో స్పష్టత వస్తుందని ఫలితంగా రైతులు, గ్రామీణ భూ యజమానులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలో అత్యాధునిక సాంకేతిక బోధనా..

పైజమ్ ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ గారి అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్ లాంటి పేరొందిన సంస్థలతో విద్యా శాఖ MOU కుదుర్చుకుంది. రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో ప్రమాణాలు పెంచాలన్న ముఖ్యమంత్రి గారి నిర్ణయం మేరకు ఆయా సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. దేశంలో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో #EdTech సదుపాయాలు కల్పించడం వల్ల రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు అవకాశం ఉంది. కృత్రిమ మేధ ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో @EkStep_Org 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5 వేలకు పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. మూడో తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లీషు భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్‌ను ఈ సంస్థ అందిస్తుంది. ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్? పరీక్షలకు @PhysicswallahAP సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది. రాష్ట్రంలో 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థుల





పాఠ్యాంశాలకు అనుగుణంగా @khanacademy వీడియో ఆధారిత STEM (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. #Prajwala ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్? 12 వరకు విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు @pijamfoundation కోడింగ్ మరియు కంప్యుటేషనల్ థింకింగ్‌పై శిక్షణను అందిస్తుంది. @educate_girls రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత, విద్యా అవకాశాలను మెరుగుపరచం కోసం పనిచేస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు గారితో పాటు, విద్యాశాఖ ఉన్నతాధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### సైప్రస్ చేరుకున్న ప్రధాని మోదీ..
### ఎయిర్ పోర్టుకు వచ్చిన దేశాధ్యక్షుడు

రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడం లక్ష్యంగా పెట్టుకున్నారు. సైప్రస్‌లోని విమానాశ్రయంలో ప్రధానమంత్రి మోదీకి ఆ దేశ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్, ఆర్థిక మంత్రి కాన్‌స్టాంటినోస్ కోంబోస్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ ఘన స్వాగతం ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక, గాఢమైన సంబంధాలకు అద్దం పడుతోంది. తన రాకకు సంబంధించిన చిత్రాలను ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ సందర్భంగా సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ కూడా ఎక్స్ ద్వారా ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతూ, "ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సైప్రస్‌కు స్వాగతం! యూరోపియన్ యూనియన్ ఆగ్నేయ సరిహద్దు, మధ్యధరా సముద్ర ముఖద్వారం వద్ద ఇది ఒక చారిత్రాత్మక పర్యటన. అపరిమితమైన వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇది ఒక నూతన అధ్యాయం. మనం కలిసికట్టుగా మరింత పురోగతి సాధించడానికి, పరివర్తన చెందడానికి, మరింత అభివృద్ధి చెందడానికి వాగ్దానం చేస్తున్నాం" అని పేర్కొన్నారు. సైప్రస్ అధ్యక్షుడి ఆత్మీయ ఆతిథ్యానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలుపుతూ, "సైప్రస్‌లో



అడుగుపెట్టాను. విమానాశ్రయంలో నన్ను స్వాగతించినందుకు సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌కు నా ధన్యవాదాలు. ఈ పర్యటన భారత్-సైప్రస్ సంబంధాలకు, ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులు వంటి రంగాల్లో మరింత ఊపునిస్తుంది" అని తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. రెండు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని సైప్రస్‌లో పర్యటించడం ఇదే ప్రథమం కావడం గమనార్హం. ఈ పర్యటన సందర్భంగా ఇరు దేశాల నేతలు ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంపొందించుకోవడం, వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, సాంకేతికత వంటి రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకునే మార్గాలపై విస్తృతంగా చర్చించనున్నారు.

# కన్నవారు మృతి.. నిస్సహాయస్థితి...

- చిన్నారులకు ఆర్థిక సాయం అందజేసిన గ్రామస్తులు...



**నూతనకల్ జూన్ 15 వెలుతురు:**

తల్లిదండ్రులను కోల్పోయి నిస్సహాయంగా మారిన ముగ్గురు అనాథ బాలలను ఆర్థికంగా ఆదుకునేందుకు స్థానిక గ్రామస్తులు ముందుకు వచ్చి 10 వేల రూపాయలను చిన్నారులకు అందజేశారు. గత కొన్ని రోజుల క్రితం నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన పంతం పరశురాములు, సుభద్ర దంపతులు మరణించడంతో వారి ముగ్గురు పిల్లలు చదువుకునే టైంలో అనాదులుగా మారి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మారారని తమ దృష్టికి రావడంతో వారు చలించి ఆర్థిక సాయం చేశామని తెలిపారు. సహాయం చేసిన వారిలో బిక్కి పరమేష్, రమేష్ (టీచర్), రమేష్, వెంకన్న, తొట్ల అనిల్, ప్రవీణ్, మల్లేష్, తొట్ల సుధాకర్ , దయాకర్ , నామాల శ్రీధర్, శ్రీకాంత్ , చీమల అంజయ్య పులుసు సుధాకర్, మహేష్, కె .వి, గుండాగని రమేష్, హరీష్ ,తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**

రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వివేకానంద ను ఆదివారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

# లోక్ అదాలత్ లో 13 వేల 48 కేసుల పరిష్కారం.

- రామగుండం సి పి, అంబర్ కిషోర్ జా.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**

జాతీయ మెగా లోక్ అదాలత్ శనివారం నిర్వహించిన సందర్భంగా రామగుండం కమిషనరేట్ పరిధిలో 13వేల 48 కేసులు పరిష్కరించబడ్డాయని, రామగుండం పోలీస్ కమిషనర్, అంబర్ కిషోర్జా తెలిపారు. ఇందులో ఐపిసి కేసులు 536, విపత్తు నిర్వహణ కేసులు 1432, పెట్టి కేసులు 56, ఈ, పి టి కేసులు, 8568, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 2456, సైబర్ నేరాల్లో బాధితులకు 17, 66,249 రూపాయలు తిరిగి చెల్లింపు, 78 కేసుల ద్వారా, 13,08,684, లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరిగిందని అన్నారు. రాజీమార్గం ద్వారా కేసుల కక్షిదారులకు అవగాహన కల్పించడంతో లక్ష్యానికి మించి కేసులను పరిష్కరించగలిగామని అన్నారు. అధికారులకు, కోర్టు సిబ్బంది కి, త్వరలో రివార్డు లు, అందజేస్తామని ఆయన వెల్లడించారు. లోక్ అదాలత్ విజయవంతం కావడం లో, సహకరించిన న్యాయమూర్తులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు, ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసిన రామగుండం సీపీ, అంబర్ కిషోర్ జా.

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**



రాష్ట్ర కార్మిక, మైనింగ్, శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి నీ, రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్, అంబకిశోర్జా మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట్ స్వామి, మాట్లాడుతూ, ఇసుక మాఫియా,అక్రమ దందాల పై ఉక్కుపాదం మోపాలని, అక్రమాలను ఊపేక్షించేది లేదని, అక్రమ దందాలకు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కొందరి పోలీసుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పద్ధతి మార్చుకోవాలని చట్టం ముందు అందరూ సమానులే అనే విషయాన్ని గుర్తించుకోవాలని అన్నారు.

# కాంగ్రెస్ కార్యకర్తకు భరోసా అందించిన మంత్రి వివేక్.



**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**

మంచిర్యాల జిల్లా, మందమర్రి పట్టణానికి చెందిన అఖిలేష్ అనే యువకుడు, రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చేయి విరిగిపోయి అత్యవసర చికిత్స అవసరమైన సందర్భంలో, విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి, డా. వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వం నుండి ఒక లక్ష 80 వేల రూపాయల ఎల్ ఓ సి విడుదల చేసి, యువకుడి ప్రాణాన్ని కాపాడారు. మంత్రి కల్పించిన సహాయంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అఖిలేష్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉండగా, అతని కుటుంబ సభ్యులు మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం కృషి

- **ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల అడుగులు**
- **అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు**
- **విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత**
- **రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**







తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని మందమర్రి మండలం సండ్రన్ పల్లి గ్రామంలోని కె. ఆర్. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాలలో 15 వేల ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటి స్థలం కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధి పొందే లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు గజములలోపు ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. గతంలో 5 లక్షల రూపాయల పరిమితి ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని, ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంతో పాటు విద్యార్థుల కొరకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో భాగంగా గతంతో పోలిస్తే 70 శాతం అధికంగా పంట ఉత్పత్తి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రత్యేక ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వినియోగదారులకు అందించడం జరుగుతుందని, ఇసుక అక్రమ రవాణా నిరోధించడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలోని పన్నులను 100 శాతం వసూలు చేసే విధంగా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని, తద్వారా ప్రజా సంక్షేమంలో భాగంగా 6 గ్యారంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే సంక్షేమ అభివృద్ధి, పథకాల అమలులో అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పారదర్శకంగా వ్యవహరించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లను అర్హత గల నిరుపేద లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుండి 2 వేల 500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, విద్యుత్, ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలలో చదివేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ విద్యాలయాలు అభివృద్ధిలో భాగంగా 2 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, రెసిడెన్షియల్ పాఠశాలల అభివృద్ధికి ఎస్ టి. పి. పి., సి. ఎస్. ఆర్. క్రింద 6.1 కోట్ల రూపాయలు, అమ్మ పాఠశాల కొరకు 10 కోట్ల రూపాయలతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేయడంలో భాగంగా భీమారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చెన్నూర్ లో బస్తీ దవాఖానా లతో పాటు ఆరోగ్య ఉప కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రైజింగ్ తెలంగాణ 2047 కార్యక్రమంలో భాగంగా ప్రస్తుతం విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వర్క్ ఫోర్స్ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. మందమర్రి మండల కేంద్రంలో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలతో పాటు అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేసి అధునాతన వృత్తి విద్య కోర్సులను అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అర్హత గల అభ్యర్థులకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 419 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు భీమా పథకం క్రింద 6 మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# నిబంధనలు పాటించని బస్సులను సీజ్ చేయాలి

- **యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి.**
- **PDSU రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. శ్రీకాంత్ డిమాండ్.**

**వెలుతురు మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూన్ 15**

మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు ఎలాంటి నిబంధనలు పాటించకుండా బస్సులను ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిబంధనలకు విరుద్ధంగా బస్సులో సీట్లకు మించి విద్యార్థులను ఎక్కించి తరలిస్తున్నారు.కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆటోలు మరియు టాటా ఏసీలలో విద్యార్థులను పాఠశాలకి తీసుకొచ్చుకుంటున్నారు. ఇటువంటి విద్యాసంస్థలపై సంబంధిత అధికారులు స్పందించి తనిఖీలు నిర్వహించి సీజ్ చేయాలని.ఆ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

డిమాండ్స్:

1)ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతి బస్సుల్లో ప్రథమ చికిత్స పెట్టే అవసరమైన మందులు ఉండాలి.

2)ప్రతి బస్సులో ఫైర్ అలారం మంట ఆర్పే పరికరాలు ఉండాలి.



3)అత్యవసర సమయంలో పగలగొట్టి బయటికి వచ్చే గ్లాస్ ఉండాలి. కిటికీలకు ఇంప గ్రిల్స్ ఏర్పాటు చేయాలి. ప్రతి బస్సులో ఒక సహాయకుడిని నియమించాలి.

4)బస్సులో విద్యార్థులు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు చోదకునికి స్పష్టంగా కనిపించేలా కుంభాకార అద్దాలు అమర్చాలి. సీట్లు సామర్థ్యం మేరకే విద్యార్థులను ఎక్కించాలి.

5)ప్రతి బస్సులో ఒక చోదకుడిని నియమించుకోవాలి. ప్రతి 3 నెలకు ఒకసారి అతని కంటి చూపు,రక్తపోటు పరీక్షలు చేయించాలి.

6)బడి బస్సులు పసుపు రంగులోనే ఉండాలి. ఇరువైపుల విద్యాసంస్థ పేరు చిరునామా ఫోన్ నెంబర్లు రాయాలి.

ఈ నిబంధనలు పాటించని విద్యాసంస్థల బస్సులను సీజ్ చేయాలని. దీనిపై RTO స్పందించి తనిఖీలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(PDSU) కోరుతున్నామన్నారు

# ఐదుగురు యువకుల మృతి పట్ల మంత్రి పొన్నం తీవ్ర దిగ్భ్రాంతి.

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 15:**

నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ ఐదుగురు యువకుల మృతి చెందడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్భాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ కి ఓ చెందిన కుటుంబం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి ఆదివారం రోజున ఉదయం గోదావరి లో స్నానానికి వెళ్ళి ఐదుగురు యువకులు గల్లంతై మృతి చెందారని సమాచారం తీవ్రంగా కలిచివేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ ల వద్దకు నదుల వద్దకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల జనవరి లో కొండపోచమ్మ సాగర్ లో ఐదుగురు యువకులు , వారం రోజుల క్రితం మేడిగడ్డ ప్రాజెక్ట్ లో పడి ఆరుగురు యువకులు మృతి చెందరు. ఇలాంటి ఘటనలు జరగకుండా తల్లిదండ్రులు వారి పిల్లలను నదులు ,కాలువలు ప్రాజెక్ట్ ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ ల ,కాలువల వద్ద లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి మంచి భవిష్యత్ కలిగిన యువకులు ఇలా చనిపోవడం బాధాకరమని వారి కుటుంబానికి దైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని వేడుకున్నారు. బాసర గోదావరి నదిలో మృతి చెందిన ఐదుగురు యువకులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వ 11 ఏళ్ల ప్రయాణం..

- **ఆపరేషన్ సింధూర్ తో దేశ సత్తా ఏంటో ప్రపంచానికి చూపించిన మోడీ..**
- **దేశానికి విశ్వఖ్యాతి.. గ్లోబల్ లీడర్ గా ప్రధాని మోడీకి గుర్తింపు..**
- **బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెట్టి సంపత్...**



**కరీంనగర్ వెలుతురు జూన్ 15:**

2014 లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం , 11 ఏళ్లలో భారతదేశ దిశా దశ మార్చిందని , భారత వైభవాన్ని విశ్వ వేదికపై నిలబెట్టిందని , సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రధాని మోదీ 11 ఏళ్ల ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దురిశెట్టి సంపత్ అన్నారు. భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు 11 సంవత్సరాల మోదీ ప్రభుత్వం-సంకల్ప సాకారం పేరిట చేపట్టిన ప్రోగ్రాంలో భాగంగా శనివారం రోజున గన్నేరువరం మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో సంకల్ప సభ జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ వాగ్దానాలన్నీ కార్యాచరణగా మార్చి, సంక్షేమం నుండి సంరక్షణ వరకు 11 ఏళ్ల కాలంలో, ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ తో నాయకత్వం అంటే ఏమిటో దేశానికి, ప్రపంచానికి ప్రధాని మోడీ చూపెట్టారని తెలిపారు. మేకిన్ ఇండియా , ఆత్మ నిర్భర్ భారత్ తో , వికసిత్ భారత్ లక్ష్యంగా మోడీ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తూ, నారీ శక్తికి పట్టంకట్టి, యువశక్తికి పగ్గాలిచ్చి , రక్షణ రంగంలో మేటిగా నిలిచి, అంతరిక్షాన పట్టు సాధించి, విద్యా వ్యవస్థకు మెరుగులు దిద్ది, ఎన్నో చారిత్రక సాహసోపేత నిర్ణయాలతో దేశాన్ని పరుగులు పెట్టిస్తు, విశ్వ గురువుగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతున్న ఘనత ప్రధాని మోదీ దే నన్నారు. ప్రజల ఆశీర్వాదం, విశ్వాసం, నమ్మకంతోనే దేశంలో వరుసగా మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రజా ఆశీస్సులతో తెలంగాణలో రాబోయేది బిజెపి ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉందన్నారు. అబద్ధపు మాటలు, మోసపూరిత హామీలతో ప్రజలందరినీ కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. ఇకరాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పని అయిపోయిందని తెలిపారు. బిఆర్ఎస్ అవుట్డేటెడ్ పార్టీ అయిందన్నారు. తెలంగాణ ప్రజలు ఈ రెండు పార్టీలను విశ్వసించే పరిస్థితి లేదని, అందుకేప్రజలంతా బిజెపి వైపు చూస్తున్నారని , మోడీ ప్రభుత్వ పాలన పట్ల విశ్వాసంతో ఉన్నారని తెలిపారు.



## మన ఆలోచన సాధన సమితి (మాస్) ఆధ్వర్యంలో ఒకే రోజు తెలంగాణ వ్యాప్తంగా 37 నియోజకవర్గాలలోని, 135 గ్రామాలలో జెండా ఆవిష్కరణ వేడుకలు






**హైదరాబాద్ వెలుతురు జూన్ 15:** మాస్ వ్యవస్థాపకులు నర్సింగ్ రావు గారి పిలుపుమేరకు ఒకే రోజు 135 గ్రామాలలో జెండాలు ఆవిష్కరించడం జరిగింది. బీసీ కులాల్లో చైతన్యం, సఖ్యత, కోసం గత నెల రోజులుగా గ్రామ బాట కార్యక్రమంని చేపడుతూ గ్రామాలలో ఉన్న బీసీలను (కులవృత్తుల చేసుకునే కులాలను) వారి మధ్య సఖ్యతను మరియు రాజకీయ చైతన్యాన్ని నింపుతూ గ్రామ బాట కార్యక్రమం కొనసాగిస్తూ ఈరోజు (జూన్ 15) ఒకే రోజు 135 గ్రామాలలో, వేడుకలగా మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర కమిటీ సభ్యులతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, నియోజకవర్గ కేంద్రాలలో, జెండాను ఆవిష్కరించడం జరిగింది... ఈ యొక్క వేడుకలలో వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు, గౌరవ అధ్యక్షులు గడ్డం నరసింహా గౌడ్, దొంత ఆనందం నేత, పూస నరసింహ బెస్త మరియు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది.



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన ప్రఫుల్ దేశాయ్ ఐఏఎస్ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని మర్యాద పూర్వకంగా కలిశారు

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 15:**



సిద్దిపేట జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన హైమవతి హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం గారిని మర్యాద పూర్వకంగా కలిశారు..

**హుస్నాబాద్ వెలుతురు జూన్ 15:**

## సంక్షేమ నేత, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారికీ పలు ఆహ్వానాలు, వినతులు

**కుత్బుల్లాపూర్ వెలుతురు జూన్ 15:**

ఆదివారం రోజున కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే గారి నివాస కార్యాలయం వద్ద కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు, అభిమానులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారిని కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.





# తెలంగాణ ఆర్టీసీ లో తొలి మహిళా డ్రైవర్ సరిత కు శుభాకాంక్షలు

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**మహిళా సాధికారత దిశగా తెలంగాణ ఆర్టీసీ..**

**మంత్రి పొన్నం ప్రభాకర్ గారి సహకారంతో ఆర్టీసీ జెబిఎం సంస్థ చెందిన ఎలక్ట్రిక్ బస్సు డ్రైవర్ గా సరిత..**

**మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి ధన్యవాదాలు తెలిపిన మహిళా డ్రైవర్ సరిత..**






**ఆర్టీసీ డ్రైవింగ్ విభాగంలో మహిళలకు ప్రాధాన్యత ఇస్తామన్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ వెలుతురు జూన్ 15: తెలంగాణ లో ఆర్టీసీ లో తొలి మహిళా డ్రైవర్ గా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం సిత్య తండా కు చెందిన వి.సరిత మిర్యాలగూడ డిపో లో జెబిఎం సంస్థ నుండి ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు మహిళా డ్రైవర్ గా విధుల్లో చేరారు. సరిత హైదరాబాద్ టూ మిర్యాలగూడ బస్సు ను నడుపుతున్నారు. గతంలో ఢిల్లీలో రవాణా సంస్థలో 10 సంవత్సరాలు డ్రైవర్ గా విధులు నిర్వహించారు. కుటుంబ పరిస్థితుల దృశ్య తనకు స్వస్థలం లో డ్రైవర్ గా అవకాశం ఇవ్వాలని ఇటీవల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో జెబిఎం సంస్థ ప్రతినిధులతో మాట్లాడి తెలంగాణ ఆర్టీసీ మిర్యాలగూడ డిపో నుండి నియమించారు. తనకు అవకాశం ఇచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ గారికి మహిళా డ్రైవర్ సరిత ధన్యవాదాలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా అడుగులు వేస్తుందని ఇప్పటికే మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు ,తాజాగా ఆర్టీసీ లో మహిళా డ్రైవర్ గా అవకాశం ఇవ్వడం జరుగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మహిళా డ్రైవర్ వి.సరిత ను మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# గండిగూడెం గ్రామంలో కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలు
















**గండిగూడెం వెలుతురు జూన్ 15:** గండిగూడెం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ షాలిన్ కుంగ్ ఫు %ఒ% కరాటే లయన్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సమక్షంలో మొదటి బ్లాక్ బెల్ట్ అవార్డుల కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు కుంగ్ ఫు మరియు కరాటేలో వివిధ స్వీయ రక్షణ ప్రదర్శనలు నిర్వహించి, తమ నైపుణ్యాన్ని చూపించారు. కాట శ్రీనివాస్ గౌడ్ గారు విద్యార్థుల ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించి, వారిని ప్రత్యేకంగా అభినందించారు. బ్లాక్ బెల్ట్ విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ – "ఇలాంటి శిక్షణలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడతాయి. ప్రత్యేకంగా బాలికలకు స్వీయ రక్షణలో ఇది ఎంతో అవసరం. తమను తాము కాపాడుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ శక్తిని, ధైర్యాన్ని అందిస్తుంది. ప్రతి విద్యార్థి ఇలా ప్రావీణ్యం సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని తెలిపారు. అందరికి అభినందనలు తెలుపుతూ, ఇలాంటి కార్యక్రమాలను ప్రతి గ్రామ స్థాయిలో ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.


## బ్యాడ్మింటన్ పోటీలు క్రీడాకారుల్లో పోటీ తత్వం, మరింత నైపుణ్యాన్ని పెంచుతాయి

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**సుభాష్ నగర్ వెలుతురు జూన్ 15:**

ఆదివారం రోజున 130 – సుభాష్ నగర్ డివిజన్ ఎస్.ఆర్ నాయక్ నగర్ ఇండోర్ స్టేడియం నందు గత రెండు రోజులుగా "ఏస్ స్పోర్ట్స్ క్లబ్" ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... క్రీడలు క్రీడాకారుల్లో పోటీ తత్వం, మరింత నైపుణ్యాన్ని పెంపొందిస్తాయని, నేటి ఆధునిక యాంత్రిక జీవితంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడను అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెంపొందుతున్నారు. అనంతరం ప్లాటినం విభాగం, గోల్డ్ విభాగాలలో విజేతలుగా నిలిచిన చంద్రబాబు, దిలీప్, చంద్ర గోపి, ఎస్వీఎల్ ప్రసాద్, స్వామి, రామంత్, అశోక్, జీవన్ లతో పాటు రన్నరప్ గా నిలిచిన శ్యామ్, భరత్, భరత్, జితేంద్ర, ప్రసాద్, అశోక్, కన్న, జ్యోతిర్మయి లతో పాటు తృతీయ, నాల్గవ స్థానం సాధించిన క్రీడాకారులకు బహుమతులను ప్రధానం చేశారు.ఐఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, స్థానిక బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఏవి శేషా చారి, భాస్కర్ రెడ్డి, అనిల్, ఎస్.ఆర్. నాయక్ నగర్ , అపురూప కాలనీ, మోడీ బిల్డర్స్, జనప్రియ అపార్ట్మెంట్ లకు కార్యవర్గ సభ్యులు రమణ, రామకృష్ణ, సత్యనారాయణ, గణేష్, పూర్ణచందర్ గుప్తా, మహేష్, దుర్గా ప్రసాద్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.







https://epaper.velthuru.com

నల్గొండ **వెలుతురు**

# నూతన బొల్లారం పోలీస్ స్టేషన్ కి శంకుస్థాపన

- **3 కోట్ల 50 లక్షల రూపాయలతో బొల్లారం పోలీస్ స్టేషన్..**
- **బొల్లారం పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**పఠాన్ చెరు వెలుతురు ప్రతినిధి జూన్ 15:**
ఆధునిక వసతులతో పటాన్ చెరు నియోజకవర్గంలో మోడల్



పోలీస్ స్టేషన్లు నిర్మిస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని సర్వేనెంబర్ 248 లో ఒక ఎకరా స్థలంలో హెట్రో లేబరేటరీస్ సౌజన్యంతో మూడు కోట్ల 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన మోడల్ పోలీస్ స్టేషన్ పనులకు ఆదివారం ఉదయం మెదక్ ఎంపీ రఘునందన్ రావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఐజి సత్యనారాయణ గౌడ్, జిల్లా ఎస్పీ పరితోష్ సంతోష్ కుమార్ లతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరొందిన పటాన్ చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని తెలిపారు. మండల కేంద్రమైన గుమ్మడిదల లోను హెట్రో లేబరేటరీస్ సౌజన్యంతో రెండు పోట్లా 50 లక్షల రూపాయలతో మోడల్ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అమీన్ చెరు, పటాన్ చెరు, కొల్లూరు, పోలీస్ స్టేషన్లను పునర్నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతో పూర్తి స్థాయి వసతులతో వీటిని నిర్మిస్తున్నామని తెలిపారు. నిరు పేద, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు నివసించే పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలతో పాటు



సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. పటాన్ చెరు నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్న హెట్రో లేబరేటరీస్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, పటాన్ చెరు డిఎస్పి ప్రభాకర్, హెట్రో లేబరేటరీస్ డైరెక్టర్ జి. మోహన్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవి బాబు, సిఐలు వినాయక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, స్వామి గౌడ్, నరేష్, నయిమొద్దీన్, లాలు నాయక్, బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, చంద్రా రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, హెట్రో సిబ్బంది, పోలీస్ సిబ్బంది, బొల్లారం స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పుణేలో బ్రిడ్జి కూలి నలుగురి మృతి... మహారాష్ట్ర సీఎంతో మాట్లాడిన ప్రధాని మోదీ

- **పుణెలో ఇంద్రాయణి నదిపై వంతెన కూలి ఘోర ప్రమాదం**
- **ఘటనలో నలుగురు పర్యాటకులు మృతి, పలువురు గల్లంతు**
- **సురక్షితంగా 39 మందిని కాపాడిన సహాయక బృందాలు**
- **మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం**
- **వంతెనల నాణ్యతపై తనిఖీలకు సీఎం ఆదేశం**
- **భారీ వర్షాలతో ఉధ్ధృతంగా ప్రవహిస్తున్న నదితూఫ్రాన్**



**పుణె వెలుతురు జూన్, 15.**
మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. కుండ్‌మాల పర్యాటక ప్రాంతంలో ఇంద్రాయణి నదిపై నిర్మించిన వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నలుగురు పర్యాటకులు మృతి చెందగా, పలువురు నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సహాయక బృందాలు తక్షణమే రంగంలోకి దిగి 39 మందిని సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారికోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నది ఉధ్ధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాద సమయంలో వంతెనపై అధిక సంఖ్యలో పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, గాయపడిన వారి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. వంతెన శిథిలావస్థకు చేరడం, సామర్థ్యానికి మించి జనం ఉండటమే ప్రమాదానికి కారణమని ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. ఇదే ప్రాంతంలో రూ.8 కోట్లతో కొత్త వంతెన నిర్మాణానికి ఇప్పటికే ఆమోదం లభించిందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని నదీ వంతెనల నిర్మాణ నాణ్యతపై తనిఖీలు (స్ట్రక్చరల్ ఆడిట్) నిర్వహించాలని మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సహాయక చర్యల గురించి సీఎం ఫడ్నవీస్‌ను అడిగి తెలుసుకున్నారు.

# అహ్మదాబాద్ ఘటనపై ఎన్నో అనుమానాలు

## పక్షి ఏమైనా ఢీ కొట్టిందా

**గాంధీనగరం, జూన్ 14, ( వెలుతురు)**
మూలుగా మనం బైక్ మీద ప్రయాణిస్తున్నప్పుడు.. అనేక జాగ్రత్తలు తీసుకుంటాం. హెల్మెట్ పెట్టుకుంటాం, టైర్లలో గాలి ఉందో, లేదో చూసుకుంటాం. పెట్రోల్ ను చెక్ చేసుకుంటాం.. ఇక త్రి చక్ర, నాలుగు చక్రాల వాహనాలలో ప్రయాణిస్తున్నప్పుడు మరింత జాగ్రత్తగా ఉంటాం అలాంటిది ఒక దేశం నుంచి మరొక దేశానికి వెళ్తున్నప్పుడు.. అది కూడా అంతర్జాతీయ విమానం ప్రయాణిస్తున్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఏ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి? కానీ ఇవేవీ పాటించలేదా? విమానాన్ని పరిశీలించలేదా? నిర్లక్ష్యంగా వదిలేశారా? ప్రయాణికుడు తాను పరిశీలించిన లోపాలను ట్విట్టర్ వేదికగా విమానయాన సంస్థకు తెలియజేసినప్పటికీ ఉపయోగం లేకుండా పోయిందా? ఇప్పుడు ఇవే ప్రశ్నలను నిపుణులు లేవ నెత్తుతున్నారు. జరిగిన దారుణంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.. టేక్ ఆఫ్ ఆయన విమానం వెంటనే కూలిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. గతంలో పైలట్ పనిచేసిన అనుభవం ఎహసాన్ ఖలీద్ అనే వ్యక్తికి ఉంది. ఈ ప్రమాదాన్నిపద్యంలో ఆయన స్పందించారు. విమానానికి ల్యాండింగ్ గేర్ కిందికి ఎలా ఉంటుందని ఆయన విస్మయ వ్యక్తం చేశారు. ఆ గేర్ కిందికి ఉండడం పట్ల అనుమానం వ్యక్తం చేశారు. విమానం నడుపుతున్న పైలట్ ఏటీసీకి "మేడే కాల్" ఇచ్చారంటే అందులో వ్యవస్థ విఫలమైనట్టేనని పేర్కొన్నారు.. అసలు ల్యాండింగ్ గేర్ కిందకు ఉండడమే అర్థం కావడం లేదని ఆయన పేర్కొన్నారు. "విమానం గాల్లో ఎగిరిన వెంటనే ల్యాండింగ్ గేర్ దానంతట అదే లోపలికి వెళ్ళిపోతుంది. కూలిన విమానానికి సంబంధించిన ల్యాండింగ్ గేర్ కిందకు ఉంది. ఈ ప్రకారం ఇంజన్ విఫలం చెందినట్టే భావించాలని" ఖలీద్ చెప్తున్నారు. " లోహ విహంగం శక్తిని కోల్పోయింది.



దానికి ఇంజన్లో తలెత్తిన లోపం కూడా కారణం కావచ్చు. సాధారణంగా విమానానికి సంబంధించి రెండు ఇంజన్లు ఒకేసారి వైఫల్యం చెందే అవకాశాలు ఉండదు. ఒకవేళ అంతటి స్వల్పకాలంలో ఏదైనా పక్షి ఢీకొంటే కూడా ఇంజన్లు విఫలమయ్యే అవకాశం లేదని" ఎహసాన్ ఖలీద్ పేర్కొన్నారు.అమెరికాలో ఏరో స్పేస్ సేఫ్టీ కన్సల్టెంట్ గా పనిచేస్తున్న ఆంటోనీ బ్రిక్ హౌస్ కూడా ఖలీద్ మాదిరిగానే అనుమానాలను వ్యక్తం చేశారు. టేక్ ఆఫ్ అయిన విమానానికి ల్యాండింగ్ గేర్ అసహజంగా ఉండడం ఈ ప్రమాదానికి కారణమని ఆయన భావించారు. విమానం ఉన్నట్టుండి ఒకేసారి కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తే రన్వే వైపు ప్రయాణిస్తున్నట్టుగా కనిపించిందని ఆయన పేర్కొన్నారు.. " అంతమంది ఉన్న విమానం ప్రయాణించడానికి పూర్తి సంసిద్ధతతో ఉందా? విమానాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేశారా? విమానానికి కీలకమైన రెక్కల స్లాట్, ఫ్లాప్ లు సరైన మార్గంలోనే ఉన్నాయా? అవి విమానం ఎగరడానికి సహకరిస్తున్నాయా? విమానం కూలిపోయిన తర్వాత కనిపిస్తున్న దృశ్యాలను చూస్తుంటే అలాగే అనిపిస్తోంది. విమానాలను నడిపే క్రమంలో ల్యాండింగ్, టేక్ ఆఫ్ అనేవి అత్యంత జాగ్రత్తగా చేపట్టాల్సిన దశలు.. గాల్లో ఎగిరిన అభిమానాలు 200 నుంచి 650 అడుగులకు పైగా ఎత్తుకు చేరుకోలేనప్పుడు పైలెట్లు కచ్చితంగా టేక్ ఆఫ్ ఆపేస్తారు. అలాంటప్పుడు చివరి దశలో ఉండగానే ఈ సమస్య ఉత్పన్నమై ఉంటుందని"అమెరికా ఏవియేషన్ సేఫ్టీ కన్సల్టెంట్ జాన్ ఎం కాక్స్ ప్రకటించారువిమానానికి సంబంధించిన రెండు ఇంజిన్ లు విఫలం కావడం లేదా పక్షి ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని నిపుణులు అంచనా బిస్తున్నారు..

విమానం కూలిపోతున్నప్పుడు.. ఆ దృశ్యాలను చూస్తుంటే ఇంజన్లు శక్తిని అందించడంలో విఫలమైనట్టు తెలుస్తోంది. ఇదే అభిప్రాయాన్ని విమానయాన శాఖలో వైట్ బాడీ పైలెట్లుగా పనిచేస్తున్న వ్యక్తులు వ్యక్తం చేశారు. ఒక ఇంజన్ గనుక విఫలమైతే విమానం ఊగిపోతుంది.. కానీ అక్కడ అలాంటి పరిస్థితి లేదు. పైగా అభిమానం స్థిరంగానే ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే రెండు ఇంజన్లు విఫలమైనట్టే అనుకోవాలి. రెండు ఇంజన్లలో త్రస్ట్ లేదని ఓ కమాండర్ వెల్లడించారు. అనుకోకుండా పక్షులు ఢీకొంటే వెంటనే ఇంజన్లలో మంటలు ఏర్పడి ఉండవచ్చని.. అందువల్లే విమానం తన రెండు శక్తిని కోల్పోయి ఉంటుందని సీనియర్ పైలెట్లు చెబుతున్నారు.. ఒక ఇంజన్ విఫలం కావడం వల్ల.. లాండింగ్ గేర్ పైకి రాకపోవడం వల్ల.. రెండవ ఇంజన్ కూడా పూర్తిస్థాయిలో శక్తిని ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల ఈ ప్రమాదం జరిగి ఉంటుందని..ఆ సీనియర్ పైలెట్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# ఇజ్రాయెల్ దాడుల్లో మరో 8 మంది టాప్ కమాండర్లను కోల్పోయిన ఇరాన్

- **టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు**
- **ప్రతీకార దాడులు జరుపుతున్న ఇరాన్**
- **పశ్చిమాసియాలో భగ్గుమంటున్న ఉద్రిక్తతలు**

**ఇజ్రాయెల్ వెలుతురు జూన్, 15.**
ఇజ్రాయెల్ టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై భీకర దాడులు కొనసాగిస్తోంది. తాజాగా ఈ దాడుల్లో తమ ఏరోస్పేస్ విభాగానికి చెందిన 8 మంది సీనియర్ కమాండర్లు మరణించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ధృవీకరించింది. ఐఆర్‌జీసీ అధికారిక వార్తా సంస్థ సెపా న్యూస్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ, వారి 'అమరత్వం' పట్ల సంతాపం ప్రకటించింది. అంతకుముందు దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మహ్మద్ బఘేరి, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ హొస్సేన్ సలామీ సహా పలువురు ఉన్నత కమాండర్లు మరణించినట్లు వార్తలు వచ్చాయి.



**ప్రతీకార దాడులు: ఇజ్రాయెల్‌లో ప్రాణ నష్టం**
ఈ దాడులకు ప్రతిగా ఇరాన్... ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలపై పలు దఫాలుగా క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టంతో పాటు భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో ఒక నివాస భవనంపై రాకెట్ దాడి జరగడంతో ఒక మహిళ మరణించగా, మరో 13 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ జాతీయ అత్యవసర వైద్య సేవ సంస్థ మాగెన్ డేవిడ్ అడోమ్ (ఎండీఏ) తెలిపింది. ఇరాన్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి కనీసం ముగ్గురు మరణించగా, 204 మంది గాయపడ్డారని ఎండీఏ అంతకుముందు వెల్లడించింది.

**దాడుల కొనసాగింపు: పశ్చిమాసియాలో ఉద్రిక్తత**
తమ వాయు రక్షణ వ్యవస్థలు దూసుకొస్తున్న క్షిపణులు, రాకెట్లను సమర్థంగా అడ్డుకుంటున్నాయని, అదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళ విభాగాలు టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై దాడులు నిర్వహిస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హైఫా మరియు ఉత్తర ప్రాంతాల వెలుపల నివసించే ప్రజలు బాంబు షెల్టర్ల నుండి బయటకు రావొచ్చని, అయితే సురక్షిత ప్రాంతాలకు సమీపంలోనే ఉండాలని ఇజ్రాయెల్ హోమ్ ఫ్రంట్ కమాండ్ సూచించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి, తీవ్ర ఆందోళన నెలకొంది.

# బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం.




**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 15**
యాదగిరిగుట్ట మండలం టిఆర్ఎస్ పార్టీ నాయకులను గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరీ ఐ శంకుస్థాపన చేసిన మెడికల్ కాలేజీని అదే స్థలంలో, నిర్మించకుండా వేరే ప్రదేశమునకు మార్చడాన్ని కి ప్రయత్నిస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసి రామన్నపేట పోలీస్ స్టేషన్కు తీసుకురావడం జరిగింది. దీనికి నిరసనగా రామన్నపేట మండల టిఆర్ఎస్ నాయకులు స్టేషన్ వద్దకు వెళ్లి నిరసన తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసిలు సాల్వేర్ అశోక్, ఎండి అమీర్, జిల్లా నాయకులు ఎస్కే చాంద్, పట్టణ కార్యదర్శి జాడ సంతోష్, నాయకులు, వంగాల యాదయ్య, బొడ్డుపల్లి రాజు, నరసింహ, సైదులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ 62వ జన్మదిన వేడుకలు






**తూఫ్రాన్ వెలుతురు జూన్, 15.**
జూన్ 15 తేదీ ఫాదర్స్ డే రోజు ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ సిఆర్ గారి 62వ జన్మదిన వేడుకలు తూఫ్రాన్ లో ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలువురు నాయకులు, జర్నలిస్టులు, అభిమానులు, శ్రేయోభిలాషులు జానకిరామ్ గారికి బర్త్ డే కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానించి,పూల మాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా తూఫ్రాన్ మున్సిపల్ పరిధి వెంకటాపూర్ లోనీ శ్రీశ్రీశ్రీ లలితా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. తూఫ్రాన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్ట్ లయన్ డాక్టర్ జానకిరామ్ గారి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తూఫ్రాన్ ప్రెస్ క్లబ్ నాయకులు గైనిబైటి భాస్కర్ గౌడ్, పెద్దిగారి నగేష్ గుప్త, వెంకటోల్ల శివ కృష్ణ గౌడ్, సర్గల స్వామి, బాలసాయి హరిప్రసాద్, జయపాల్ రాథోడ్, లయన్స్ క్లబ్ నాయకులు లయన్ బుడ్డ భాగ్యరాజు, లయన్ డాక్టర్ అప్సర్ భాయ్, లయన్ కుమ్మరి రమేష్, లయన్ గరీగే నర్సింగ్ రావు, లయన్ బల్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం - మాజీ సీఎం విజయ్ రూపానీ మృతదేహం గుర్తింపు

- **అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ మృతి**
- **మూడు రోజుల తర్వాత డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతదేహం గుర్తింపు**
- **రూపానీ కుటుంబ సభ్యుల డీఎన్ఏతో సరిపోలిన నమూనాలు**
- **మొత్తం 32 మంది మృతుల డీఎన్ఏ నమూనాలు సరిపోలినట్లు వెల్లడి**
- **తీవ్రంగా కాలిపోవడంతో మృతదేహాల గుర్తింపులో జాప్యం**

**అహ్మదాబాద్ వెలుతురు జూన్, 15.**




గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఇటీవల సంభవించిన ఘోర విమాన ప్రమాదంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటన జరిగిన మూడు రోజుల అనంతరం, గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత విజయ్ రూపానీ మృతదేహాన్ని గుర్తించినట్లు అధికారులు ధృవీకరించారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఆయన భౌతికకాయాన్ని నిర్ధారించినట్లు గుజరాత్ హోంమంత్రి హర్ష్ సంఘ్వీ వెల్లడించారు. విజయ్ రూపానీ కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన నమూనాలతో, ప్రమాద స్థలంలో లభ్యమైన ఓ మృతదేహం డీఎన్ఏ సరిపోలిందని, దీంతో అది రూపానీదేనని నిర్ధారించుకున్నామని సంఘ్వీ తెలిపారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ విమాన ప్రమాదం అత్యంత తీవ్రమైనది కావడంతో అనేక మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాయి. దీంతో మృతుల గుర్తింపు ప్రక్రియ సవాలుగా మారింది. ఇప్పటివరకు మొత్తం 32 మంది మృతుల డీఎన్ఏ నమూనాలు వారి కుటుంబ సభ్యుల జన్యు నమూనాలతో సరిపోలినట్లు అధికారులు తెలిపారు. గుర్తింపు ప్రక్రియ పూర్తయిన వెంటనే మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగిస్తున్నారు. డీఎన్ఏ పరీక్షలకు సమయం పడుతుండటంతో మృతదేహాల గుర్తింపులో కొంత జాప్యం జరుగుతోందని వైద్యులు వివరించారు. ఈ నెల 12న అహ్మదాబాద్ నుంచి లండన్ వెళుతున్న ఎయిరిండియా విమానం టేకాఫ్ తీసుకున్న నిమిషాల వ్యవధిలోనే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 274 మంది వరకు మరణించారు.